# విశ్వసుందరి

శ్రీ K. V. సుబ్బారావు బి. ఏ.

(గతసంచిక తరువాయి)

"అయ్యో! అయ్యో" అని కలకంఠి మొత్తుకుంది. కాని ఆ రాక్షసుడు ఆమె మొర ఆలకించలేదు. ఉరిమినట్లు "పకాపకా" నవ్వి వెళ్ళిపోయాడు. భువనసుందర్‌ను మ్రింగేసిన తరువాత గదిలో పడుకొని నోరుతెరచి గురకపెట్టి నిద్దరపోతున్నాడు. కలకంఠి నెమ్మదిగా రాక్షసుని నిద్రాభవనంలోకి వచ్చింది. సైగచేసింది భువనసుందర్‌ను బయటకు రమ్మని. నెమ్మదిగా భువనసుందర్ రాక్షసుని కడుపులోనుండి నోట్లోకివచ్చి గట్టుచప్పుడుగా రాజకుమార్తె ఒడిలోకి దూకాడు. ఇద్దరూ బయటకొచ్చేశారు.

"ఇప్పుడెలా రాక్షసుడిని చంపటం -?" భువనసుందర్ అడిగాడు.

"ఈ రాక్షసుడి ప్రాణం క్రిందగదిలో ఒక మణిలోవుంది. కాని ఆ మణివంటివే మరో ఎనిమిది మణులుకూడా అక్కడ వున్నయ్. ఏ మణిలో రాక్షసునిప్రాణంవుందో కనుక్కోటం కష్టం. ఆ గదిలోకిపోయి వాడి ప్రాణంవున్న మణిని నేలకేసికొడితే రాక్షసుడు చస్తాడు. లేక ఇంకో ఇతర మణిని ముట్టుకున్నారంటే నిలువున చిత్రవధచేయబడతారు. అందుకనే రాక్షసుడి ప్రాణం యేదో కనుక్కోలేక చిత్రవధయైపోయినవారనేకమంది వున్నారు. మీ యిష్టం - సాహసించి ముందడుగు వేస్తారో జడిసి తగ్గుతారో మీరే నిర్ణయించుకోవాలి" అంది.

"వెనుదిరగటం భీరువుల లక్షణం. నా లక్ష్యం ఎంత ప్రమాదాన్నయినా ఎదుర్కొని ముందడుగు వేయటమే" అని తక్షణమే ఆ గదిలోకి దూకాడు.

అక్కడ తొమ్మిది మణులున్నయ్. తొమ్మిది మణులు ఒకే మాదిరిగా కనిపిస్తున్నయ్! ఏమణిలో రాక్షసుని ఆయువుందో! సరే ఏదయితే అదవుతుందని నాల్గవమణిని పట్టుకొని నేలకేసికొట్టాడు. తక్షణమందే నిద్రలో రాక్షసుడు వులిక్కిపడిలేచి ముక్కలు ముక్కలయ్యాడు. కాని అంతా విచిత్రంగా వుండిపోయింది. రాక్షసుడికి బదులుగా ఒక దేవయువకుడు; ఎనిమిదిమంది సేవకులు ఆయా స్థానాల్లో ప్రత్యక్షమయ్యారు.

ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు భువనసుందర్.

"ఆశ్చర్యంగావుందా నీకు! మేము దేవతా యువకులం. మేము దేవేంద్రుడి అనుంగు బంటులం. కాని ఒకసారి మదమెక్కి కనపడిన కన్యనల్లా అవమానపరచసాగినాము. అది దేవేంద్రుడు చూసి మమ్మల్ని యీ రీతిగా శపించాడు. నీ వల్ల శాపవిమోచనులమయ్యాము. ధన్యులము. నీవు కోరిన రత్నాంగుళీయం ఇదిగో. ఇది సర్వ సుఖాలను ఇస్తుంది. దీనిని ధరిస్తే ఎప్పుడు విజయమే వరిస్తుంది. ఇంద - ఇది తీసుకో. ఈ కన్య సుశీల. యీమెను వివాహమాడు" అని చెప్పి ఆ దేవతా పురుషులు మాయమయ్యారు.

భువనసుందర్ రత్నాంగుళీయాన్ని తీసుకొని కలకంఠిని తీసుకొని సరాసరి కలకంఠి రాజ్యానికి వచ్చాడు. కలకంఠి తండ్రి తేజవర్మ కూతుర్ని కౌగలించుకొని ఆనంద భాష్పాలు రాల్చాడు. కలకంఠికి తండ్రే తల్లి. తల్లి చిన్నతనంలోనే పోవటం వల్ల గారాబంగా పెంచాడు. ఒక శుభముహూర్తాన కలకంఠి భువనసుందర్‌ల వివాహం జరిగింది. మూడు రోజులువుండి భార్య దగ్గర సెలవుతీసుకొని సరాసరి మణికర్ణిక దగ్గరకు బయలుదేరాడు.

భువనసుందర్ సరాసరి రాజభవనంలోకివచ్చాడు. సభా ప్రాంగణంలో కొలువుతీర్చి కూర్చున్న మహారాజు మణికర్ణికలకు నమస్కరించి తాను సాధించి తెచ్చిన రత్నాంగుళీయాన్ని మణికర్ణికకు ఇచ్చాడు. ఆమె పైకి మాత్రం సంతోషాన్ని నటించుతూ - "భేష్! నిజంగా వీరుడవంటే నువ్వేనయ్యా! అభేద్యమయిన మూడు వస్తువుల్ని సాధించి ఘనత దక్కించుకున్నావ్! నీకు నా జోహారులు" అని పొగిడింది. భువనసుందర్ యీ పొగడ్తలకు వుబ్బిపోలేదు. ఆమె పొగడ్తలను నిశితంగా పరిశీలించితే పొగడ్తలవెనక ఏదో పెద్ద కుట్ర దాగివుందని అర్థమైంది.

"మీరు కోరినట్లు మూడు వస్తువులను సాధించాను. ఇక మీ మాట నెరవేర్చుకోండి" అన్నాడు.

తన జిత్తులేవి పారకపోయేసరికి మణికర్ణిక నిలువున దహించుకుపోతోంది. భువనసుందర్‌ను చంపించి విశ్వసుందరి జీవితం నాశనంచేయాలని ఎంతో ప్రయత్నించింది. కాని ఆవిడ జిత్తులేవి పారలేదు. ఆమె వాళ్లకు ఎంత అపకారంచేయాలని ప్రయత్నించిందో అంత ఉపకారంగా పరిణమించింది. ఆ కుత్సితురాలి వ్రేలినితెంచి రత్నాంగుళీయం భువనసుందర్ వ్రేలినలంకరించింది. దానితో ఇంకా మండిపోయింది రాణి.

"నీకు బహుమతి కావాలికదూ!" వెటకారంగా అంది.

"అవును మహారాణీ! మీ పరీక్షలో నెగ్గితే రాకుమారిని నాకిచ్చి పరిణయంచేస్తానని మొదటే వాగ్దానంచేశారుకదా! నీలవదన రాణిగారు ఆడిన మాట తప్పరనే ఇంతవరకు విశ్వసిస్తున్నాను-" అన్నాడు నమ్రతగా.

"అవును! నేను అదే అనుకుంటున్నాను" అని చప్పట్లు చరిచింది. వెను వెంటనే ఇద్దరు భటులు ప్రత్యక్షమయ్యారు.

"ఏయ్ ఇలా రండి. భువనసుందర్‌ను చెరసాలలో వేయండి! రేపు నా కతని గ్రుడ్లు పెరకి చూపించాలి" అంది కోపంగా.

ఇంతవరకు ఇది ఒక వింతగా చూస్తున్న మహారాజు దిగ్గున లేచాడు. "ఆగండి" అని గర్జించాడు. సభాసదులు రిత్తపోయారు.

"ఇంతవరకు మహారాణిచేతిలో కీలుబొమ్మను. కాని ఇప్పుడు ఆమె నా చేతిలో కీలుబొమ్మ. ఈ కృతఘ్నురాలిని వుప్పుపాతరలో వూడ్చివేయండి. రాణి కుట్రకు సంబంధించినవారినందర్ని బంధించండి" అన్నాడు మహా కోపంతో.

మణికర్ణిక పారిపోవటానికి పెనుగలాడింది. కాని ఆవేషాలు కుదరలేదు. పాపం! మణికర్ణిక సజీవంగా ఉప్పుపాతరపాలైంది! మహారాజు భువనసుందర్‌ను సమీపించి – "మా అమ్మాయికి తగిన వరుడివి నీవేనోయ్" అని కౌగలించుకొని ఆనంద భాష్పాలు రాల్చాడు.

ఆ మరునాడే మహా వైభవంతో విశ్వసుందరి భువనసుందర్‌ల వివాహం జరిగింది. భువనసుందర్ వజ్రాల ఉంగరం నేలకురాయగానే గంధర్వకన్య ప్రత్యక్షమయింది. నాగసుందరిని మనసులో తలుచుకున్నాడు. ఆమె రత్నాల బండ్లతో ప్రత్యక్షమయింది. కలకంఠి ఆమె వెంటనే తేజవర్మ వచ్చాడు. మళ్లీ వైభవంగా నలుగురు కన్యలతో వివాహం జరిగింది. నీలవదనుడు అల్లుడికి రాజ్యం ఇచ్చేశాడు. అవసరమైతే అప్పుడప్పుడు అల్లుడికి సలహాలిచ్చేవాడు. భువనసుందర్ నలుగురు రాణులకు నాలుగు బంగారు మేడలు కట్టించి సంతోషాన్ని అనుభవిస్తూ నీలవేణి నగరాన్ని పరిపాలించాడు. ఆ మూడు వస్తువులు వున్నన్నాళ్లు కరువు కాటకాలు తలెత్తిచూడలేదు.